**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ**

# వంద నోటు

**-వి.ఎస్.ఆర్.కేశవరావ్**

ఎక్కే గుమ్మం దిగే గుమ్మంలా ఉంది నాల్రోజుల నుంచి అప్పారావు పరిస్థితి. ఇంక మూడురోజులు గడిస్తే గానీ నెల పెన్నిధి అందదు. అప్పటిదాకా ఇంతేనా! పెన్నిధి అందితే ఇరవై రోజులు ఢోకా ఉండదు. తర్వాత మళ్ళీ మామూలే. 'ఛీ! వెధవ బ్రతుకు' అనుకున్నాడు. స్మశాన వైరాగ్యం, ప్రసూతి వైరాగ్యంలాంటిదే మధ్యతరగతి బ్రతుకులకి ప్రతి నెలా సంప్రాప్తిస్తుంది. ఎప్పటికో మోక్షం అని బాధపడ్డాడు. ఇదో చక్రభ్రమణం అనుకున్నాడు.

ఈరోజు గడవాలంటే కనీసం యాభైరూపాయలైనా కావాలి. ఇంకా మూడురోజులుంటే నూటయాభై కావాలి. ఎలా? ఎలా సంపాదించాలి? ఎవరిని అడగాలి. హీనపక్షం వంద అయినా ఉంటే గండం గడుస్తుంది. వంద ఉంటే తను ఎంత అదృష్టవంతుడో ఈనెలకి అనుకున్నాడు. అనుకుంటూ ఆఫీసుకి చేరుకున్నాడు.

హాల్‌లోకి దృష్టిసారించాడు. తనకంటే ముందు చేరుకున్న సహచరులు అటెండరుతో టీ తెప్పించుకునే ప్రయత్నంలో ఉన్నట్టు గమనించాడు. నడిచి ఆఫీసుకు చేరుకోవడం వల్ల వచ్చిన నీరసం పటాపంచలైంది.

అందరిదృష్టి ఆకర్షించేలా రెండుమూడుసార్లు దగ్గాడు. ఎవరూ పట్టించుకోలేదు.

తన సీటులో కూర్చుని ఫైళ్ళు దులిపాడు. ఒక్కొక్కరినీ పేరు పేరునా పలకరించాడు వాళ్ల వాళ్ళ సీట్లు దగ్గరకు వెళ్లి.

"ఏంటి సంగతి? బావున్నావా? హలో ఎలా ఉన్నావు"వంటి పొడి పొడి మాటలే తప్ప సంభాషణ కొనసాగనివ్వలేదు సహచర మిత్రబృందం. సంభాషణ కొనసాగితే టీలో వంతు ఇవ్వాల్సి వస్తుందని వీళ్ల బాధ కాబోలు. కృతఘ్నులు అని కసిగా తిట్టుకున్నాడు.

మళ్లీ తన సీటులోకి వచ్చి నీరసంగానే పని ప్రారంభించాడు. పిలిస్తే వెళ్లి కంపెనీ ఇద్దామనుకున్నాడు. కొంతసేపు గడిచాక తల ఎత్తి చుట్టూ చూస్తే అందరూ టీ తాగడం పూర్తిచేసి ఏకాగ్రచిత్తంతో పనిచేయడం గమనించాడు.

తన దగ్గర డబ్బు ఉన్నప్పుడు పిలిచినా పిలవకపోయినా ఆ కబురు ఈ కబురూ చెబుతూ ఏదో విధంగా మాట కలిపేస్తూ వెంటపడి బలవంతంగా కంపెనీ ఇచ్చే ప్రయత్నం చేస్తూ తనకంటే ముందే హోటళ్లలో, కేంటీన్లో ఆర్డర్ జారీచేశాడు. చివర్న బిల్లు మాత్రం తన ముందుకు తోసేసేవీళ్ళు ఎంత కృతఘ్నులు? డబ్బు లేనప్పుడు ముఖ్యంగా నెలాఖరురోజుల్లో మధ్యతరగతికి చెందిన కొందరిలో కృతఘ్నుతా భావం విజృంభిస్తుందేమో అనుకున్నాడు.

* * *

లంచ్‌బ్రేక్‌లో ఆ నలుగురూ ఒక బ్యాచ్‌లా బయటపడ్డారు. అప్పారావు కేసి చూడను కూడా చూడలేదు.

విధిని తిట్టుకుంటూ తప్పనిసరి పరిస్థితిలో ఆత్మాభిమానాన్ని కసిరికొట్టి పరుగుపరుగున వాళ్లని చేరి "హలో...హలో..." అన్నాడు.

పెద్దగా పట్టించుకోలేదు.

వచ్చిన కోపాన్ని దిగమింగి చిరునవ్వు పులుముకుని హలోకి పేరు కూడా జమ చేస్తూ పలకరించాడు.

ఇక తప్పదని మాటలు కలిపారే గానీ ఎలా వదలించుకోవాలా అని పథకాలు వేయసాగారు.

"మళ్లీ కలుద్దాం" అంటూ వెంకట్ మిగతావాళ్లకి కన్నుగీటిపోయాడు.

పదడుగులు పడ్డాక "పనుంది. ఇటు వెళ్లాలి" అంటూ రాయుడు పక్కదారి పట్టాడు.

రాముడు వెళ్లిన కాస్సేపటికి పక్క సందులోంచి పోతున్న అపరిచితుడిని చప్పట్లు కొట్టి పిలుస్తూ రాఘవ జారుకున్నాడు.

సుబ్బారావు అప్పారావుతో పాటూ నడుస్తూ అందరూ తప్పుకున్నారు నేనెలా అనుకుంటూ ఏదేదో మాట్లాడుతూ పోస్టాఫీసు కనబడగానే బ్రతుకుజీవుడా అనుకుని "పనుంది వస్తా" అంటూ జవాబు కోసం చూడకుండా పోస్టాఫీసులో దూరాడు.

దొంగనాయాళ్ళు. ఎవరుమటుకు వాళ్లు జారుకున్నారు. లంచ్‌టైంలో ఏదో ఒకటి పడేసి చల్లార్చకపోతే జఠరాగ్ని ఇంకా దహించేస్తుంది. డబ్బులేని నీరసానికి ఇది కూడా తోడైతే కష్టమే. నెలాఖరు రోజుల్లో ఆకలి కూడా పేట్రేగిపోతుంది అదుపు, ఆజ్ఞల్లో ఉండదసలు అనుకున్నాడు అప్పారావు.

ఇక మంచినీటి పథకం తప్పదు అనుకుంటూ ప్రతి నాలుగడుగుల నడకకీ రెండేసి నిముషాలు ఆగుతూ చివరకి ఎలాగో తాము రెగ్యులర్‌గా వెళ్ళే హోటల్‌కి చేరాడు. కౌంటర్ దగ్గర ఆగి హోటల్ నలుదిశలా పరికించాడు.

ఓ మూలనున్న టేబుల్ వద్ద వెంకట్, రాయుడు, రాఘవ కనిపించారు కబుర్లు చెప్పుకుంటూ. సుబ్బారావు ఇంకా చేరుకోలేదన్నమాట అనుకుంటూ మంచినీళ్లతో గొంతు తడిపాడు.

బయటకు వచ్చేశాడు. దూరంగా సుబ్బారావు. సుబ్బారావుకి కనబడకుండా దాక్కున్నాడు. అతడు లోపలికి వెళ్లాక కాసేపు తారట్లాడి వాళ్ల టేబుల్‌ని చేరాడు అప్పారావు.

అప్పుడే వాళ్లని చూసినట్టుగా "అరె మీరూ వచ్చేశారే! భలే కలిశాం" అంటూ కుర్చీ లాక్కున్నాడు నవ్వుతూ.

దరిద్రుడు వెంటబడి మరీ వచ్చేశాడు. తప్పించుకున్నా తప్పట్లేదు అని ఎవరికి వాళ్ళు అనుకుంటూ బాగున్నరోజుల్లో అప్పారావు కూడా తమ గురించి ఇలాగే అనుకోలేదు గదా అని ఉలిక్కిపడ్డారు. ఇంతలో మూడు ప్లేట్ల మైసూర్‌బజ్జీ తెచ్చాడు బేరర్.

మెల్లిగా అందరూ తలో రెండూ నోట్లో వేసుకు

న్నారు. మిగిలిన రెండు బజ్జీలు ఎవరి పాల పడతాయో అని ఎవరు మటుకు వాళ్లు గుటకలు వేస్తున్నారు. నలుగురి చేతులూ ఆ ప్లేట్ మీదకు ఒకసారి దాడిచేయడం గమనించిన అప్పారావు ఒక్క ఉదుటున లేచి రెండు బజ్జీలని ఒకేసారి లాఘవంగా పట్టేసి గుటుక్కున నోట్లో పెట్టేశాడు.

నలుగురి ముఖాలూ వెలవెలపోయాయి అనుకుంటూ ఉండగానే "అప్పారావ్ ఎలాగైనా స్పీడే" అన్నారు నలుగురూ ఒకేసారి.

టూబై ఫైవ్ టీలు తాగారు.

బిల్లు టేబుల్ మీదకు రాగానే ఒకరి ముందుకు మరొకరు నెట్టసాగారు.

"హలో హల్లో.." అంటూ అప్పారావు పరుగులాంటి నడకతో వెళ్లిపోతూంటే "ఎవరికివాళ్లం విడిపోయినా వాసన పసిగట్టి హోటల్‌కి చేరి పని పూర్తి కాగానే ఎలా వెళ్లిపోతున్నాడో" అన్నాడు సుబ్బారావు.

"మనం ఎన్నిసార్లు ఈ పరిస్థితి అప్పారావుకి



కల్పించామో గుర్తులేదా?" అన్నాడు రాయుడు.

"డబ్బు కోసం కటకటలాడుతున్నాడు గురుడు" అన్నాడు వెంకట్.

హడావుడిగా బయటకు వచ్చిన అప్పారావు మెట్లు దిగుతూ పరధ్యానంలో ఇంకో మెట్లు కూడా ఉందనుకుని దిగబోయి తూలి పడిపోయి నిలదొక్కుకుంటూంటే కింద వందనోటు కనిపించింది. అంతే పడిపోతున్నట్లుగా వంగిదాన్ని దొరకబుచ్చుకున్నాడు ఎవరూ చూడకుండా.

ఎవరో వచ్చి లేపబోతుంటే తనే లేచాడు.

"దెబ్బలు తగిలాయా"

"లేదండీ..." అని సిగ్గుపడుతూ, నవ్వులు కురిపిస్తూ చేత్తో దులువుకుని వెళ్లిపోయాడు అప్పారావు.

ఎవరూ గమనించని చోట జేబులోని నోటు తీసి 'వందనోటు. అబ్బా వంద నోటు' అనుకుంటూ పరిశీలించాడు.

సెల్లో టేపుతో కనీ కనబడకుండా అతికించిన కొత్త నోటు అది.

నీరసం వచ్చింది. నోటు మారుతుందా? మారకపోతే ఎలా? చినిగిన నోట్లకు కమీషన్ మినహాయించుకుని ఇచ్చేవారి దగ్గర మార్చేస్తే. దొరకక దొరికిన మొదటి నోటు. అందులోనూ మంగళవారం పూట మార్చడం ఎందుకులే! అనుకున్నాడు. ఆఫీసు అయ్యాక నడుచుకుంటూ ఇంటికి చేరుకున్న అప్పారావ్‌లో ప్రతి నెలాఖరుకు కనిపించే నీరసం కనబడక భార్య ఆశ్చర్యపోయింది. ఇంటికి చేరగానే విసుక్కోవడం, గొణుక్కోవడం, చికాకుపడడం, ఏదైనా అడిగినా పిల్లల్ని కొట్టడం వంటి సంఘటనలు జరగకపోవడం కుటుంబసభ్యులను ఆశ్చర్యపరిచింది. తెల్లారింది. అప్పారావుకు కాఫీ ఇచ్చిన భార్య అతని ప్రసన్న వదనం చూసి సరుకులు నిండుకున్నట్లు చెప్పింది బెరుకుబెరుకుగా.

ప్రతినెలాఖరు రోజుల్లా మాదిరిగా విసుక్కోకపోవడం ఆశ్చర్యం కలిగింది. కొడుకుని పిలిచి "అమ్మ సరుకులు కావాలంటోంది. ఇది మార్చి ముప్పై రూపాయలతో తే. మిగతా చిల్లర జాగ్రత్త అసలే నెలాఖరు" అన్నాడు.

సరుకులతో తిరిగొచ్చిన కొడుకు విసుగ్గా "నాన్నా! ఈ నోటు పడదట. జీతాలు రాగానే డబ్బు ఇవ్వమని చెప్పి షావుకారు సరుకులు ఇచ్చాడు" అంటూ వందనోటు చేతిలో పెట్టాడు.

తీసుకుంటూ అయితే ఈ నోటు ఈరెండ్రోజులు తురుపుముక్కలా వాడుకోవచ్చన్నమాట అనుకున్నాడు.

ఆఫీసు లంచ్ అవర్లో ఎవడ్నీ పట్టించుకోకుండా ఒక్కడే ముందుగా హోటల్‌కి చేరుకున్నాడు. డబ్బు చేతిలో ఆడకపోతే మనసులో స్వార్థమూ పేట్రేగుతుంది కాబోలు అనిపించింది.

ధైర్యంగా స్వీటూ, హాటూ తిని టీ తాగి కౌంటర్లో వందనోటు ఇచ్చాడు బిల్లుతో పాటూ.

అటూ తిరగేసి "ఇంకోటి ఇవ్వండి" అన్నాడు.

కంగారుగా జేబులోని కాగితాలు అన్నీ తీసి వెదికి "సారీ ఇంకోటి లేదు" అన్నాడు అప్పారావు.

రెగ్యులర్ కస్టమర్ కావడంతో "తరువాత ఇవ్వండి" అన్నాడు.

హమ్మయ్య రెండో గండం గడిచింది.

తురుపుముక్కలా ఇంకో రెండ్రోజులు ఆ వందనోటుని వాడి జీతాల్రోజున బాకీలు తీరుస్తూ మధ్యలో ఆ వందనోటు పెట్టి ఇవ్వడం, దాన్ని వాళ్ళు తిరిగి ఇచ్చేయడం సారీ అంటూ మరో నోటు ఇవ్వడం సాధారణమైపోయింది.

అలా మూడునెలాఖర్లు ధిలాసాగా గడిపాడు అప్పారావు కష్టమర్లను మారుస్తూ.

నెలచివర్లో హుషారుగా ఖర్చు చేస్తున్న అప్పారావు కిటుకుని రాయుడు కనిపెట్టి మిగతా సహచరులకు ఊదాడు. నాల్రోజులు గడిచాక రాయుడుతో మాట్లాడుతూ ఇరవై చేతిలో పెట్టి "ఆ వందనోటు ఈసారి నాకియ్యి. ఒకటో తారీఖున ఇస్తా" అన్నాడు అప్పారావుతో.

మొదట ఆశ్చర్యపోయి ఆతర్వాత నమ్మకం కుదుర్చుకుని వందనోటు ఇచ్చాడు రాయుడికి.

రాయుడు మధ్యతరగతి కష్టాలు తీర్చిందానోటు నెలచివర్లో.

మిగతా సహచరులు కూడా అప్పారావుతో స్నేహం పెంచుకుంటూ ఒక ఒప్పందానికి వచ్చారు.

ఎంత అవసరమైనా ఆనోటుని మార్చకూడదని, నెలకి ఒకరు చొప్పున ఆనోటు తీసుకోవడానికి అందుకు ప్రతిఫలంగా తీసుకున్న వ్యక్తి అప్పారావుకి ముప్పైరూపాయలు ఇస్తూ ఉండాలని నోటుని రొటేషన్ పద్ధతిలో అందరూ ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇదీ బాగానే ఉంది అలా వచ్చిన ముప్పైని దాచి నెలాఖరులో వాడుకోవచ్చు. అప్పుడు అప్పుకోసం ఎక్కే గుమ్మం దిగే గుమ్మం పరిస్థితి తప్పుతుంది అనుకుని చిద్విలాసంగా నవ్వాడు అప్పారావు.

★

## ముఖానికి జిరాక్స్ కాపీ

అట్లీక్ వాషింగ్టన్‌లో ఒక స్కూల్లో జిరాక్స్ మెషిన్ గురించి పాఠాలు చెప్తూ టీచరు ఐదేళ్ల ల్యూక్ అనే కుర్రాడి ముఖానికి ఫోటో కాపీ తీసిందిట. ఆ సంగతి తెల్సిన వాళ్ల తల్లిదండ్రులు తరచి తరచి అడిగితే కళ్లల్లో చుక్కలు కనబడుతున్నాయనీ, దురదగా ఉంటోందని చెప్పాడట. ఎర్రబడిన ఆ కుర్రాడి కళ్లను చూసి కంగారుపడి డాక్టర్ దగ్గరకు ట్రీట్‌మెంట్ చేయిస్తున్నారు. ఆ స్కూల్లోంచి ఆ కుర్రాడ్ని మాన్పించి మరో స్కూల్లో చేర్పించి, ఆ టీచర్ మీద చట్టప్రకారం చర్య తీసుకుంటున్నారట!

## షాపింగ్ చేసే కుక్క

చైనాలో చెంగ్డూ సిటీలో ఊక్వియాన్ పెంపుడు కుక్క తనకు ఆకలేస్తే ఇంట్లో డాగ్ ఫుడ్ ఇవ్వమని, లేకపోతే డబ్బివ్వమని మొరుగుతుందిట. యజమాని డబ్బివ్వగానే ఆ కుక్క షాపుకు వెళ్లి సాసేజ్ ఇవ్వమన్నట్లుగా మొరుగుతుందిట. యజమాని ఇచ్చింది కరెన్సీ నోటు కాకపోతే అది తీసుకోదు. అలాగే ఏ షాపుకెళ్లాలో ఆ కుక్కకు తెలుసు. షాపువాడు సాసేజ్ ఇస్తే గానీ డబ్బులివ్వదు. దాన్నెవ్వరూ మోసగించలేరని గర్వంగా చెబుతాడు దాని యజమాని.

-తటవర్తి

ఈ అపార్ట్‌మెంట్లోకి కొత్తగా వచ్చిన ... జంట బాగుంటున్నారమ్మా.. ఇకపోతే సంసారంలో నిప్పులు పోసేవాళ్ళెక్కువ.. అన్నట్టు మీవారు ఆఫీసుకెళ్తే వాకిలి ఓ అమ్మాయితో మాట్లాడుతూ కన్పించారమ్మా!

